క్లుప్తంగా

జాతీయ సహాయ కార్యదర్శిగా గంగారాం



బాన్సువాడ : మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ సహాయ కార్యదర్శిగా సందుల గంగారాం నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం జాతీయ అధ్యక్షుడు పసుపుల రామూర్తి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గంగారాం జాతీయస్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మాలల హక్కుల కోసం కృషి చేస్తానని అన్నారు.

దుప్పట్ల పంపిణీ



బాన్సువాడ : బీర్కూర్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం 14 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు సొసైటీ ద్వారా దుప్పట్లు అందజేస్తున్నామన్నారు. బీర్కూర్‌లో 14 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు గంగాధర్, జిల్లా అధ్యక్షుడు విఠల్, సభ్యులు అశోక్, విజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మట్టెల వితరణ



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామానికి చెందిన రేణుక వివాహానికి జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, మున్సిపల్ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరిరవిప్రసాద్ పుస్తె, మట్టెలను ఆదివారం అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన రేణుకకు తమ వంతు సహాయం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

ఎల్లారెడ్డి: సైబర్ మోసాలబారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎల్లారెడ్డి పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల రేషన్‌కార్డుల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని సైబర్ నేరస్తులు రేషన్ కార్డు నమోదు కోసం ఓటీపీలు చెప్పాలని ప్రజలను మోసం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడొద్దని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పి బ్యాంకు ఖాతాలోని డబ్బులను గుల్ల చేసుకోవద్దని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి పద్మశాలి సంఘం యువజన విభాగం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుర్రి కుమార్, ఉపాధ్యక్షుడిగా భూపతి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా దొంతుల నవీన్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా అల్లగొండ గోపి, సిరిపురం రవి, కోశాధికారిగా కోమటి దుర్గాప్రసాద్, ఆడిటర్‌గా పాముల ప్రవీణ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కుర్రి రవి, సిరపురం తేజ, బింగి ప్రసాద్, పాముల ప్రణయ్, చౌకి భరత్, అల్లందాస్ సాయిప్రసాద్, అల్లందాస్ సాయిప్రసన్న, కోమటి శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు దుదుక నరేందర్ తెలిపారు.

లింగారెడ్డిపేటలో పడిపూజ



ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేటలో అయ్యప్పస్వామి పడిపూజను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన కన్నెస్వామి మోహన్ అయ్యప్పస్వామి వారికి అభిషేకం చేసి పడిమెట్ల పూజను చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు హనుమంతప్ప, శ్రీనివాస్, నాగేశ్, రాజేందర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

తండాలకు మట్టిరోడ్లేనా?

- హామీలను అమలుచేయని గత ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గుంతలమయమైన కొడప్‌గల్ - బేగంపూర్ తండారోడ్డు



కంకర తేలి ప్రమాదకరంగా మారిన మనిషిరామ్ తండా రోడ్డు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తండాలకు వెళ్లేందుకు మట్టిరోడ్లే దిక్కయ్యాయని, రోడ్లు వేస్తామన్న గత ప్రభుత్వం హామీలను అమలు చేయలేదని తండాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా రోడ్లు వేసి తమ ఇబ్బందులను దూరం చేస్తుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. గ్రామాలు, తండాల మట్టిరోడ్లను తారు రోడ్లుగా మార్చేందుకు మోక్షం ఎప్పుడు కలుగుతుందని ఎదురు చూస్తున్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని మనిషిరామ్ తండా, పెద్ద దేవిసింగ్‌తండా, కాటేపల్లి తండా, దుబ్బతండా, కొడప్‌గల్ గ్రామం నుంచి బేగంపూర్ తండా వరకు మట్టి రోడ్లే వేశారు. పాలకులు మారుతున్నా రోడ్ల స్థితి మారడం లేదు. తారురోడ్లు వేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండాపోతున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలుస్తుండడంతో పరిస్థితి అధ్వానంగా మారుతోంది. ఆయా గ్రామాల పెద్దకొడప్‌గల్ నుంచి బేగంపూర్ తండా మీదుగా కాస్లాబాద్, వడ్లం గ్రామాల ప్రజలు వెళ్లాలంటే మోకాళ్ల లోతు గుంతలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నరకం కనిపిస్తున్నదని ఆయా గ్రామాలు ప్రజలు అంటున్నారు. తండాల రోడ్లను తారు రోడ్లుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు బాగు చేయాలి



పెద్దకొడప్‌గల్ నుంచి బేగంపూర్ తండా మీదుగా వెళ్లే రోడ్డును బాగు చేయాలి. అప్పుడే రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. రోడ్డు అధ్వానంగా, గుంతలమయంగా తయారైంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మరమ్మతులైనా చేయించాలి.

– విఠల్‌నాయక్, బేగంపూర్ తండా

హామీలే తప్ప.. అమలు లేదు



ఎన్నికల సమయంలో రోడ్లు వేస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం అమలు చేయడంలో శ్రద్ధ చూపలేదు. ఈ ప్రభుత్వమైనా రోడ్లు వేసి ఇబ్బందులను దూరం చేయాలి. రోడ్డు బాగలేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– జాదవ్ శ్యాంసుందర్, మనిషిరామ్ తండా

కొనసాగుతున్న మల్లన్న ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న వీడీసీ సభ్యులు

- నేడు స్వామి వారి కల్యాణోత్సవం



అగ్నిగుండాల కోసం ఏర్పాట్లు..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో మల్లన్న జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శనివారం రాత్రి స్వామి వారికి మైల తీయడం, ఆదివారం ఉదయం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు పూజలు, ఆలయాల్లో డప్పు వాయిద్యాల మధ్య కొబ్బరికాయలు, గుమ్మడి కాయలు కొట్టే కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన సోమవారం ఉదయం అగ్ని గుండాలు తొక్కుట, మధ్యాహ్నం మల్లన్న, మేడాలమ్మ, గొల్లకేతమ్మ కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. 9వ తేదీన బోనాల ఊరేగింపు, ఒడిబియ్యం కార్యక్రమాలతోపాటు సాయంత్రం 4 గంటలకు ఎడ్లబండ్ల ప్రదర్శనను హైదరాబాద్‌కు చెందిన కళాబృందంతో నవచైతన్యయూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వివరించారు. 10న చక్కెర తీర్థం, జాతర, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. నాలుగు రోజుల పాటు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అలాగే ప్రతిరోజూ రాత్రి ఒగ్గు కథా కాలక్షేపం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, ఉపాధ్యక్షుడు భోజన్నగారి రాజు పాటిల్, గూడెల్లి గంగాధర్, ద్యావరి నవీన్, నాగల్ల స్వామి, సాకలి నర్సింలు, అరెటి శ్రీనివాస్, బాలయ్య, నిట్టు ప్రభాకర్, కుర్ర శంకర్, గ్రామస్తులు తేలు స్వామి, శంకర్‌రావు, నాగల్ల స్వామి, అవుసుల గంగాధర్, కానకుంట సురేందర్, గోజారి స్వామి, ఉనుగురి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సట్టి పండుగ



పిట్లం(జుక్కల్): మండలంలోని కంబాపూర్ గ్రామంలో ఉన్న శ్రీమల్లికార్జున ఆలయంలో ఆదివారం సట్టి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు, పాలాభిషేకం చేశారు. సట్టి పండుగ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిగొండ, కేసు గొండ, శివుగొండ, వీరప్ప, అంజయ్య, శ్రవణ్‌కుమార్, రాజుపాటిల్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామారెడ్డి అర్బన్: చిన్నమల్లారెడ్డి 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 12 నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషన్స్ డీఈఈ వెంకటరంగయ్య తెలిపారు. చిన్నమల్లారెడ్డి, కామారెడ్డి హౌసింగ్‌బోర్డు, నర్సన్నపల్లి, చిన్నమల్లారెడ్డి, రాజంపేట సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అదనపుగది అందుబాటులోకి రాదేమి?



మొగులాన్‌పల్లి తండా పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణం

బాన్సువాడ రూరల్: మండలంలోని మొగులాన్‌పల్లి తండాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గది పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించి కొత్త అదనపు గది పనులకు గతేడాది శ్రీకారం చుట్టారు. పనులు ప్రారంభించి ఏడాది పూర్తయినా నేటికీ గది అందుబాటులోకి రాలేదు. దీంతో ఐదు తరగతులకు చెందిన విద్యార్థులకు ఒకే గదిలో పాఠాలు చెప్పాల్సి వస్తోంది. గత ఆరునెలల క్రితం నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్‌తో మాట్లాడి పూర్తిచేయించాల్సిన అధికారులు.. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విద్యార్థులకు తిప్పలుతప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు గది పనులు పూర్తిచేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. పుట్టువెంట్రుకలు, పుట్టు ఒల్లెలు, వాహన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, నరసింహాచార్యులు, పరంధామాచార్యులు, సంజీవాచార్యులు, సిబ్బంది సంతోష్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిఘానేత్రాల నేలచూపులు



బాన్సువాడ రూరల్: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని అంటారు. వాస్తవానికి నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయి. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి అటు పట్టణాల్లో, ఇటు గ్రామీణ ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తున్నారు. కానీ పలుచోట్ల నిర్వహణ లోపం కారణంగా నిఘానేత్రాలు(సీసీ కెమెరాలు) నేలచూపులు చూస్తున్నాయి. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. బాన్సువాడ పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో ఒకటైన తాడ్కోల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వంగిపోయి నేలవంక చూస్తున్నాయి. పట్టణంలో పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో నిర్వహణ తీరు ఎలా ఉంటుందోననే పలు చర్చించుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సీసీ కెమెరాల నిర్వాహణపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా హనుమాన్ పూజ

భిక్కనూరు: మండల కేంద్రంలో హనుమాన్ స్వాములు హనుమాన్ పూజా కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. భక్తిగీతాలు ఆలపించారు.



సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): కులమతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి, విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురావడం సాధ్యమని భావించి ఆ దిశగా కృషి చేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. హైదరాబాద్‌లోని బోయినపల్లిలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సావిత్రీబాయి పూలే 193వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి సీతక్కతోపాటు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలికలకు విద్యను అందించినందుకు సమాజం నుంచి విమర్శలు వచ్చినా ఎదురొడ్డి నిలిచిన సావిత్రీబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ప్రతి సమస్యకు భగవద్గీతలో సమాధానం



కార్యక్రమంలో పాల్గొన్న బాలలు

కామారెడ్డి అర్బన్: జీవితంలో ప్రతి సమస్యకు భగవద్గీతలో సమాధానం లభిస్తుందని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) కామారెడ్డి ప్రతినిధి వెంకటదాస్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక ఇస్కాన్ సెంటర్‌లో సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించగా.. బాలలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 11 గంటల నుంచి రెండు గంటలపాటు నిర్వహించే సామూహిక భగవద్గీత పారాయణం కార్యక్రమానికి మంచి స్పందన లభించడం ఆనందంగా ఉందని వెంకటదాస్ అన్నారు. భగవద్గీత పారాయణంతోపాటు భజనలు, నృత్యాలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీరామకోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి, ఇస్కాన్ ప్రతినిధులు యుగల్ కిశోర్, పరశురామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

12న మెగా రక్తదాన శిబిరం



కామారెడ్డి అర్బన్: స్వామి వివేకానంద జయంతి, యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 12న జిల్లా ఏరియా ఆస్పత్రిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్)ల సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రతినిధులు డాక్టర్ వేదప్రకాశ్, బాలు, గంప ప్రసాద్ తెలిపారు. రక్తదాన శిబిరం విజయవంతానికి ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్యశాలలో రక్త నిల్వలు లేకపోవడంతో అత్యవసర రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆస్పత్రి రోగుల కోసం 12న యువతీయువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేసి ఆదర్శంగా నిలువాలని ప్రతినిధులు పిలుపునిచ్చారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు జమీల్, కిరణ్, పుట్ట అనిల్, రమణ, చంద్రశేఖర్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రక్తదాతలు 94928 74006 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సకాలంలో పెన్షన్ హర్షణీయం



మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగులు

మద్నూర్(జుక్కల్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశ్రాంత ఉద్యోగులకు సకాలంలో పెన్షన్ డబ్బులు విడుదల చేయడంపై విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి గంగారాం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెలా సకాలంలో పెన్షన్‌లు విడుదల చేస్తే తమకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉండవన్నారు. అలాగే కొందరికి పీఆర్సీ 2020 బెనిఫిట్స్ పెండింగ్‌లో ఉన్నాయని.. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను అందించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు రామారావు, సభ్యులు విఠల్‌గురూజీ, ఈశ్వర్, హన్మంత్‌రావ్, నాగ్‌నాథ్, బస్లింగ్, జ్ఞానిదాస్, విఠల్, శకుంతలబాయి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో కిసాన్ మున్నూరుకాపు పటేల్ సంఘం క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కానకుంట గోవర్ధన్ పటేల్, ఉపాధ్యక్షుడు పట్నం గోపాల్‌పటేల్, ప్రధాన కార్యదర్శి కావేటి శ్రీనివాస్‌పటేల్(పంతులు), సంయుక్త కార్యదర్శి గుర్రం జిన్నయ్యపటేల్, కోశాధికారి అముదాల భానుశంకర్‌పటేల్, కో ఆర్డినేటర్ బెల్లం మహేశ్‌పటేల్, సలహాదారులు ఆకుల నారాయణపటేల్, బిట్ల కృష్ణపటేల్, జంగిటి అంజయ్యపటేల్, కడారి సదాశివుడు పటేల్, సాయిరి స్వామిపటేల్, త్రిమెన్ కమిటీ ప్రతినిధులు కాసం రాజయ్యపటేల్, నక్క రాజంపటేల్, కానకుంట సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



సోమ్లానాయక్ తండాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



బీర్కూర్‌లో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ అఖిల్

బాన్సువాడ/బాన్సువాడ రూరల్: భారత్ వికసిత్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బీర్కూర్ మండలంలోని ఆయా గ్రామాలతోపాటు బాన్సువాడ మండలం సోమ్లానాయక్‌తండాలో ప్రజలకు కిసాన్ సమ్మాన్‌నిధి, ఉజ్వలభారత్, ఆయుష్మాన్ భారత్, బీమాయోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. నోడల్ ఆఫీసర్లు సాయికుమార్, అఖిల్, ప్రియాంక, వెంకట్, ఆరోగ్యమిత్ర పద్మనరేందర్, ఆరోగ్యశ్రీ అధికారిణి రుూన్సీరాణి, ఏఎన్‌ఎం కావ్య, మత్స్యశాఖ అధికారి షేక్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర



బాన్సువాడ మండలం పోచారంలో శోభాయాత్ర



ఎల్లారెడ్డిలో..



బాన్సువాడలో..



మద్నూర్‌లో అక్షింతల పంపిణీ..



కామారెడ్డిలో అక్షింతలతో కౌన్సిలర్ పిట్ల వేణు, కాలనీవాసులు

సాక్షి నెట్‌వర్క్: అయోధ్య శ్రీరాములవారి పూజిత అక్షింతల శోభాయాత్ర, పంపిణీ కార్యక్రమాలను జిల్లాలోని పలుచోట్ల ఆదివారం నిర్వహించారు. కామారెడ్డిలోని 45వ వార్డులో అక్షింతలను పంపిణీ చేయగా, కౌన్సిలర్ పిట్ల వేణుగోపాల్, కాలనీవాసులు పాల్గొన్నారు. రామారెడ్డి మండలం మోషంపూర్, బాన్సువాడ పట్టణంతోపాటు మండలంలోని పోచారం, మద్నూర్ మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలో బజరంగ్‌దల్, వీహెచ్‌పీ నాయకులు ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. నస్రుల్లాబాద్, బొమ్మన్‌దేవ్‌పల్లి, భిక్కనూర్ మండల కేంద్రంతోపాటు జంగంపల్లి, పెద్దమల్లారెడ్డి, బస్వాపూర్, కాచాపూర్‌లో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు.